https://epaper.kalamjyothi.com

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక


సోమవారం
12.10.2026

3వ రోజు ముద్దపప్పు బతుకమ్మ



ఆశ్వయుజ మాసం మూడో రోజు ఈ వేడుక జరుగుతుంది. ఈ రోజున బతుకమ్మను మూడంతరాల్లో చామంతి పూలు, మందార పూలు, గీతమ్మ జడ, కొమరాణం పూలు పేర్చి తామర పాత్రల్లో బతుకమ్మను అందంగా అలంకరిస్తారు. శిఖరంపైన గౌరమ్మను ఉంచి ఉదయం పూజలు చేసి సాయంత్రం గుడి దగ్గర లేదా 4 రోడ్ల కూడలిలో ఆడవారందరూ కలిసి ఆడుకొని చెరువులో వేసి వస్తారు. ఈ ముద్దపప్పు బతుకమ్మ రోజున ముద్దపప్పు, పాలు, బెల్లంతో కలిపి బతుకమ్మకు నైవేద్యంగా సమర్పిస్తారు.

వేసవిని మరిచిన సెగలు!



- అక్టోబర్‌లోనూ మాడు పగిలే ఎండలు
- రాష్ట్రవ్యాప్తంగా నిప్పులు చెరుగుతున్న భానుడు
- పలు ప్రాంతాల్లో 37 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- నెలాఖరుకు 40 డిగ్రీలకు చేరే ప్రమాదం
- ఎల్ నినో ప్రభావంతో తీవ్రమైన ఉక్కపోత
- మధ్యాహ్నం బయటకు రాలేక ప్రజల అవస్థలు
- వాతావరణ శాఖ అధికారుల హెచ్చరికలు

2 లో..

చల్లబడాల్సిన అక్టోబర్‌లో భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. శరదృతువు ఆహ్లాదం మాయమై రాష్ట్రవ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు వేసవి కాలాన్ని తలపిస్తున్నాయి. సాధారణం కంటే మూడు నుంచి నాలుగు డిగ్రీలు అధికంగా నమోదవుతుండటంతో ప్రజలు తీవ్ర ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. పలు జిల్లాల్లో ఏకంగా 37 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు నెలాఖరుకు 40 డిగ్రీలకు చేరుకోవచ్చన్న వాతావరణ శాఖ హెచ్చరికలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి.

- కలంజ్యోతి, హైదరాబాద్



హైదరాబాద్ డ్రగ్స్‌కు మూలం గోవానే

- బీజేపీ వివక్ష పాలనపై సీఎం రేవంత్ ధ్వజం
- హైదరాబాద్‌కు అక్కడి నుంచే మాదకద్రవ్యాల సరఫరా
- యువత భవిష్యత్తు కోసం పోరాడాలి

2 లో..



రాజ్యమేలుతున్న దందాలు!

ప్రజలకు దూరమైన నేతలు!

2 లో..

- సొంత పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకు మొండిచేయి
- ఎన్నికల వేళ చేరిన కొత్తవారికే అందలాల పందేరం
- అత్యవసర వేళ కూడా పేదలకు అందని ప్రజాప్రతినిధులు
- ఫోన్లు సైతం ఎత్తకుండా బాధితుల పట్ల నిర్లక్ష్యం
- పదవుల పంపకాల్లో రూ.కోట్ల ముడుపుల ప్రచారం
- పారదర్శక పాలన పదని నిలదీస్తున్న నియోజకవర్గ జనం

ఇసుక, మొరం, రియల్ మాఫియాదే పెత్తనం!?

అక్రమాలను నిలదీస్తే జర్నలిస్టులపై అక్రమ కేసులు!



నియోజకవర్గంలో రాజకీయం తీవ్ర వివాదాలకు వేదికవుతోంది. ఇసుక, మొరం, రియల్ మాఫియా అక్రమాలను ప్రశ్నిస్తే అణచివేతలు, కేసులు, పరువు నష్టం దావాలతో జర్నలిస్టులు, బాధితుల గొంతు నొక్కుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కష్టకాలంలో జెండాలు మోసిన కార్యకర్తలను పక్కనబెట్టి కొత్తవారికే పదవులు కట్టబెడుతుండటం పార్టీలో అసంతృప్తికి దారితీస్తోంది. అత్యవసర వైద్య సేవల కోసం ఎదురుచూసే నిరుపేదలకు కనీసం ఫోన్లలో కూడా ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండటం లేదు. అక్రమ దందాలు, అధికార దర్పం, పాలకుల నిర్లక్ష్య వైఖరిపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

- కలంజ్యోతి, నాగర్‌కర్నూల్

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
2
సోమవారం 12.10.2026
www.kalamjyothi.com

రాజ్యమేలుతున్న దందాలు! ప్రజలకు దూరమైన నేతలు!


కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (అక్టోబర్ 11) : నియోజకవర్గంలో ఒకవైపు ఇసుక, మొరం, రియల్ ఎస్టేట్ అక్రమ వ్యవహారాలు, ప్రశ్నించే వారిపై కేసుల పర్వం సాగుతుండగా, మరోవైపు క్షేత్రస్థాయిలో ప్రజలు, కార్యకర్తలకు ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండకపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సహజ వనరుల దోపిడీని ప్రశ్నించే జర్నలిస్టులు, పౌరులపై కేసులు, పరువు నష్టం దావాలతో సమాధానం చెబుతున్నారనే ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే తప్పా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అనుమతుల్లేని దోపిడీకి అండదండలు..

నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఇసుక, మొరం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా సహజ వనరులను తరలిస్తున్నప్పటికీ అధికారులు ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రియల్ ఎస్టేట్ లావాదేవీలు, ఇతర వ్యాపారాల్లో రాజకీయ అండదండలతో కొందరు అక్రమ లబ్ధి పొందుతున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ వ్యవహారాలపై సంబంధిత శాఖల నిఘా, పర్యవేక్షణ ఏమాత్రం లేకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

ప్రజా గొంతుకలపై దావాల అణచివేత..

సమస్యలను ప్రశ్నించిన జర్నలిస్టుపై ఏకంగా కోటి రూపాయల పరువు నష్టం దావా వేయడం, కార్యకర్తల ద్వారా వరుస కేసులు బనాయిస్తుండటం తీవ్ర దుమారం రేపుతోంది. వ్యక్తిగత పరువు కాపాడుకునే హక్కు చట్టపరంగా ఉన్నప్పటికీ, ప్రజా ప్రయోజనాల కోసం అక్రమాలను నిలదీసే గొంతులను భయభ్రాంతులకు గురిచేసేందుకే ఇలాంటి మార్గాలు ఎంచుకుంటున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.





భారీగా ఆర్థిక లావాదేవీలు..

కౌన్సెలర్ తిమ్మాజీపేట పాండు

నియోజకవర్గంలో మూడేళ్లుగా సాగుతున్న ఇసుక, మొరం, కంకర, రియల్ ఎస్టేట్ అక్రమ వ్యాపారాలు, సెటిల్‌మెంట్ల వ్యవహారాలపై రెండో వార్డు కౌన్సిలర్ తిమ్మాజీపేట పాండు తీవ్ర ఆరోపణలు చేశారు. స్థానికంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ నాయకుల అక్రమ సంపాదనల వివరాలను ప్రస్తావించారు. రైస్‌మిల్లు కేసులో ఓ వ్యక్తిని తప్పించే క్రమంలో భారీగా ఆర్థిక లావాదేవీలు జరిగాయని ఆరోపించారు. నియోజకవర్గంలో సాగుతున్న అక్రమ దందాలపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

కొద్దికాలంలోనే అక్రమ సంపాదనల జోరు..

నియోజకవర్గంలో గత పదేళ్ల పరిస్థితులతో పోలిస్తే, కొద్దికాలంలోనే కొందరి ఆర్థిక స్థితిగతులు అమాంతం పెరిగిపోవడంపై ప్రజల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. కీలక రాజకీయ పదవులు, కాంట్రాక్టులు, వ్యాపార లావాదేవీల ద్వారా పెద్దయెత్తున అక్రమ ఆర్జన సాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యమైన పదవి కోసం రూ.75 లక్షలు, కిందిస్థాయి పదవుల కోసం రూ.40 లక్షల వరకు చేతులు మారాయనే వార్తలపై అధికార యంత్రాంగం ఎందుకు సమగ్ర విచారణ జరపడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

జెండాలు మోసిన యువతకు తీవ్ర అన్యాయం..

రాజకీయ కష్టకాలంలో ప్రత్యర్థుల ఒత్తిళ్లను సైతం తట్టుకుని, పార్టీ జెండాలు మోసి నిలబడిన నిజమైన కార్యకర్తలను ఇప్పుడు పూర్తిగా విస్మరిస్తున్నారనే వ్యక్తమవుతోంది. ఎన్నికల సమయంలో ఇతర పార్టీల నుంచి కొత్తగా చేరిన వారికే అధిక ప్రాధాన్యం ఇస్తూ, ఏళ్ల తరబడి శ్రమించిన పాత తరం యువతను దూరం పెడుతుండటంతో ద్వితీయ శ్రేణి నాయకత్వంలో తీవ్ర అసంతృప్తి రాజుకుంటోంది. పార్టీ ఎదుగుదలకు కారణమైన కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వాల్సిన కనీస బాధ్యత లేదా అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజల కష్టాలకు స్పందించని వైనం..

ప్రజాప్రతినిధులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలనే కనీస బాధ్యతను సైతం విస్మరిస్తున్నారనే అసంతృప్తి వ్యక్తమవుతోంది. అత్యవసర వైద్య సేవల కోసం హైదరాబాద్‌కు వెళ్లే నిరుపేద కుటుంబాలు సహాయం కోసం ఎన్నిసార్లు ప్రయత్నించినా ఫోన్లలో సైతం సరైన స్పందన లభించడం లేదని బాధితులు వాపోతున్నారు. బాధ్యతలు ఎంత ఉన్నప్పటికీ ప్రజల బాధలను ఆలకించే తీరిక లేకపోతే నాయకత్వంపై ప్రజలకు నమ్మకం ఎలా నిలుస్తుందని నిలదీస్తున్నారు.

జవాబుదారీతనమే ముఖ్యం..

సమస్యల పరిష్కారం కోసం ప్రజలు గెలిపిస్తే, ఆ హోదాలను సొంత ప్రయోజనాలకే వాడుకుంటున్నారనే భావన బలపడుతోంది. అధికారంలో ఉన్నవారు క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై పనిచేయాలి. అక్రమ దందాల ఆరోపణలకు సరైన సమాధానం చెప్పడం, కార్యకర్తల్లో గూడుకట్టుకున్న అసంతృప్తిని తొలగించడం, అత్యవసర సమయాల్లో బాధితులకు అండగా నిలవడం పాలకుల కర్తవ్యం. ప్రజలు కోరుకుంటున్నది భయపెట్టే కేసుల రాజకీయాలు కాదు, నిబద్ధతతో కూడిన పారదర్శక పాలన, అందుబాటులో ఉండే ప్రజానాయకత్వం.

వేసవిని మించిన సెగలు!

కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 11) : రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు అక్టోబర్ మాసంలోనూ వేసవి కాలాన్ని తలపిస్తున్నాయి. సాధారణంగా శరదృతువు ప్రారంభమై ఆహ్లాదకరమైన వాతావరణం ఉండాల్సిన సమయంలో ఎల్ నినో ప్రభావం వల్ల పరిస్థితి భిన్నంగా మారింది. భానుడి ప్రతాపంతో ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. ప్రస్తుతం పలుచోట్ల 37 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, నెలాఖరు నాటికి ఇవి 40 డిగ్రీలకు చేరే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతల నమోదు

రాష్ట్రవ్యాప్తంగా పది ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 37 డిగ్రీల సెల్సియస్ దాటాయి. సాధారణం కంటే ఇవి 3 నుంచి 4 డిగ్రీలు అధికం కావడం గమనార్హం. రుతుపవనాల నిష్క్రమణ ఆలస్యం కావడం, ఆకాశం నిర్మలంగా ఉండి సూర్యరశ్మి నేరుగా పడటం, తూర్పు గాలుల ప్రభావంతో ఎండ తీవ్రత పెరిగింది. ఈ నెల 15 నాటికి ఈశాన్య రుతుపవనాలు మొదలయ్యే అవకాశం ఉండగా, వారంలో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

పలు జిల్లాల్లో నమోదైన వివరాలు..

ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో మధ్యాహ్నం వేళల్లో ప్రజలు బయటకు రావడానికి జంకుతున్నారు. నల్గొండ జిల్లా కట్టంగూర్‌లో 37.4, ఖమ్మం జిల్లా పెనుబల్లిలో 37.3, పెద్దపల్లి జిల్లా రామగిరిలో 37.2, నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో 37, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో 37, నిజామాబాద్ జిల్లా మెండోరాలో 37, సూర్యాపేట జిల్లా మునగాలలో 37, కుమరం భీం జిల్లా సిర్పూర్‌లో 37, మహబూబాబాద్ జిల్లా కురవిలో 36.9 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

హైదరాబాద్ డ్రగ్స్‌కు మూలం గోవానే

కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 11) : గోవా ప్రజల పట్ల బీజేపీ తీవ్ర వివక్ష చూపుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. గోవా అస్తిత్వాన్ని, అక్కడి భూములను కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేశారు. బీజేపీ పాలనలో గోవా యువత సరైన ఉపాధి లేక తీవ్ర నిరాశతో మత్తు పదార్థాల బారిన పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం గోవా పూర్తిగా డ్రగ్స్ అడ్డాగా మారిపోయిందని, దేశంలోని ప్రధాన నగరాలకు అక్కడి నుంచే మాదకద్రవ్యాలు సరఫరా అవుతున్నాయని ఆరోపించారు.

హైదరాబాద్ డ్రగ్స్ మూలాలు గోవాలోనే

హైదరాబాద్ నగరంలో పట్టుబడుతున్న డ్రగ్స్ మూలాలు గోవాలోనే ఉన్నాయని, అక్కడి నుంచే ఇక్కడికి అక్రమంగా రవాణా అవుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో డ్రగ్స్ విచ్చలవిడిగా లభించేవని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్, పోలీసు నిఘా ద్వారా నెట్‌వర్క్‌లను ఛేదిస్తూ ఉక్కుపాదం మోపామని వివరించారు. గోవా భవిష్యత్తును కాపాడేందుకు యువత చైతన్యవంతం కావాలని, బీజేపీ అస్తవ్యస్త పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు.



కాంగ్రెస్ తప్పుడు ప్రచారం మానుకోవాలి

- **రాజ్యాంగబద్ధ సంస్థలపై ఆరోపణలు తగవు**
- **బీజేపీ మండల అధ్యక్షుడు భూమల్ల అనిల్ కుమార్**

కలంజ్యోతి, ఇల్లంతకుంట (అక్టోబర్ 11) : ఓట్ చోరీ అంటూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తక్షణమే మానుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు భూమల్ల అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం ఇల్లంతకుంటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికల సంఘం వెన్నెముక వంటిదని పేర్కొన్నారు. ఓటర్ జాబితాలను మరింత పారదర్శకంగా ప్రక్షాళన చేసేందుకే చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్ నాయకులు నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని, చిత్తశుద్ధి ఉంటే వాటికి ఆధారాలు ప్రజల ముందుంచాలని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ సంస్కరణలు, తమకు తగ్గుతున్న ప్రజాదరణను తట్టుకోలేకే రాహుల్ గాంధీ సహా కాంగ్రెస్ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీతో పాటు రాజ్యాంగబద్ధ సంస్థలపై బురదజల్లుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్ తదితర రాష్ట్రాల్లో గెలిచినప్పుడు లేని అభ్యంతరాలు, ఓటమి ఎదురైనప్పుడు తెరపైకి తేవడం కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 240 స్థానాలు సాధించి, ప్రజాతీర్పును గౌరవిస్తూ ఎన్డీయే కూటమితో కలిసి ప్రజాస్వామ్యబద్ధంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు.

ప్రజలకు క్షమాపణ చెప్పాలి..

రాజకీయ ప్రయోజనాల కోసం రాజ్యాంగబద్ధ సంస్థల ప్రతిష్ఠను దిగజార్చేలా వ్యవహరిస్తున్న రాహుల్ గాంధీ, కాంగ్రెస్ మిత్రపక్షాలు దేశ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ బత్తిని సాయి గౌడ్, మాజీ మండల అధ్యక్షులు దేశెట్టి శ్రీనివాస్, నాగ సముద్రాల సంతోష్, అసెంబ్లీ కోకన్వీనర్ బత్తిని స్వామి, మండల ప్రధాన కార్యదర్శి కరికె నవీన్, ఉపాధ్యక్షుడు చింతలపల్లి తిరుపతిరెడ్డి, కార్యదర్శి లొంకోజు చంద్రం, ఇట్టిరెడ్డి లక్ష్మారెడ్డి, కోశాధికారి పిల్లి గోపాల్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు కొమ్ము హరికృష్ణ, మండల కార్యవర్గ సభ్యులు పయ్యావుల బాలయ్య, గూడెల్లి భాస్కర్, చదవాల శ్రీధర్, గడ్డం కొండల్ రెడ్డి, పలుమారి రవి, చిట్యాల శ్రీనివాస్, సీనియర్ నాయకులు దాసరి శ్రీనివాస్, గజగోని శంకర్రావు, సదువాల రవి, పొన్నం కృష్ణ, చొప్పరి వంశీ తదితరులు పాల్గొన్నారు.



కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

3

సోమవారం 12.10.2026

www.kalamjyothi.com

దేవీ శరన్నవరాత్రుల ఆధ్యాత్మిక సందడి

- అంగరంగ వైభవంగా అమ్మవార్ల ఆగమనం
- పురవీధుల్లో దుర్గామాత విగ్రహాల ఊరేగింపు
- భక్తిశ్రద్ధలతో దర్శించుకున్న భక్తులు



కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 11) : మండలంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందడి ఘనంగా ప్రారంభమైంది. ఉత్సవాల నేపథ్యంలో ఆదివారం మండల కేంద్రంలో అమ్మవార్ల ఆగమనం అంగరంగ వైభవంగా సాగింది. శ్రీ దుర్గామాత యూత్ అసోసియేషన్ 24వ వార్షికోత్సవం సందర్భంగా గ్రామ పురోహితుడు రాచర్ల హనుమాండ్ల శర్మ ఆధ్వర్యంలో, దుర్గాభవాని సేవా సమితి యూత్ సభ్యులు గ్రామ పురోహితుడు రాచంద దయానంద్ శర్మ ఆధ్వర్యంలో, శ్రీ దుర్గామాత ఉత్సవ కమిటీ 8వ వార్షికోత్సవాన్ని పురోహితుడు శ్రావణ్ శర్మ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దుర్గామాత విగ్రహాలను పూలతో అందంగా అలంకరించిన ట్రాక్టర్లపై శ్రీ మార్కండేయ మందిరం నుంచి మండల కేంద్రంలోని పురవీధుల గుండా ఊరేగింపుగా మండపాలకు తీసుకొచ్చారు. సింహవాహనంపై కొలువుదీరిన దుర్గమ్మ రూపాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అమ్మవార్ల రాకతో మండల కేంద్రంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయజయధ్వానాల మధ్య స్వాగతం పలికారు. నవరాత్రి ఉత్సవాల ప్రారంభంతో మండలంలో పండుగ శోభ సంతరించుకుంది. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, సర్పంచ్ ఎలగందుల నరసింహులు, ఉప సర్పంచ్ బందారపు బాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కృష్ణ యాదవ్, నాయకులు బండారి బాల్‌రెడ్డి, నంది కిషన్, మేగి నరసయ్య, పారిపెల్లి రాంరెడ్డి, పారిపెల్లి సంజీవరెడ్డి, మద్దుల తిరుపతిరెడ్డి, సాధు మల్లారెడ్డి, జావాజీ లింగం, ఓద్నాల నారాయణ, కటుకం బాలయ్య, గుండాడి వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సందుపట్ల లక్ష్మారెడ్డి, యమగుండ కృష్ణారెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొని శ్రీ దుర్గామాతను దర్శించుకున్నారు



క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం

- సింగారం హెల్పింగ్ హాండ్స్ అండ
- రూ.10 వేల నగదు అందజేత
- ఆదుకోవాలని దాతలకు విజ్ఞప్తి

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 11) : క్యాన్సర్‌తో బాధపడుతున్న నిరుపేద కుటుంబానికి అండగా సింగారం హెల్పింగ్ హాండ్స్ వెల్ఫేర్ సొసైటీ నిలిచింది. సింగారం గ్రామానికి చెందిన దూదేకుల భాను బీ, భర్త హుస్సేన్ అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్య పరీక్షల్లో క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ కావడంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ విషయం తెలుసుకున్న సింగారం హెల్పింగ్ హాండ్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు బాధిత మహిళను పరామర్శించి, తమ వంతు సహాయంగా రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. క్యాన్సర్ చికిత్సకు మరింత ఆర్థిక సహాయం అవసరమైన నేపథ్యంలో దాతలు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని సొసైటీ సభ్యులు కోరారు. దాతలు ఆర్థిక సహాయం అందించాలనుకునేవారు 9550943700 నంబర్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగరాజు, బాలనర్స్, ప్రభాకర్, వెంకటస్వామి, రాజు వై, నవీన్, రాజు వి, మహేష్ వై, శ్రీనివాస్, విజయ్ కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.



సూడీది రాజేందర్‌కు పరామర్శ

- గుండెపోటుతో ఆసుపత్రిలో చికిత్స
- ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న నాయకులు
- త్వరగా కోలుకోవాలని కేకే మహేందర్ రెడ్డి ఆకాంక్ష

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 11) : ఎల్లారెడ్డిపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూడీది రాజేందర్ గుండెపోటుతో స్థానిక అశ్విని ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కేకే మహేందర్ రెడ్డి ఆసుపత్రికి వెళ్లి రాజేందర్‌ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అక్కడి వైద్యులు, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. రాజేందర్ ధైర్యంగా ఉండాలని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారితో పాటు గంభీరావుపేట మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మల్లుగారి నరసయ్య గౌడ్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు దోమ్మాటి నరసయ్య, జిల్లా కాంగ్రెస్ నాయకులు పర్ష హన్మండ్లు, షేక్ గౌస్, బండారి బాల్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, టీఆర్ఎస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ మజీద్ తదితరులు ఆసుపత్రికి వెళ్లి రాజేందర్‌ను పరామర్శించారు.





కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం

- సిరిసిల్ల జిల్లా దశాబ్ది ఉత్సవాల నిర్వహణ
- ఎల్లారెడ్డిపేటలో బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు
- మండల అధ్యక్షుడు వరస కృష్ణహరి

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 11) : రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పాటై పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా మండల కేంద్రంలో కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం పాలాభిషేకం నిర్వహించారు. జిల్లా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల అధ్యక్షుడు వరస కృష్ణహరి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టాయి. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు వరస కృష్ణహరి మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పాటుతోనే ఈ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోయిందని తెలిపారు. స్వయం పాలనలో కేసీఆర్, కేటీఆర్ చొరవతోనే జిల్లా సమగ్ర అభివృద్ధి సాధ్యమైందని, జిల్లా ఏర్పాటై దశాబ్దం పూర్తయిన సందర్భంగా వారి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి సంబురాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు, ప్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సర్పంచులు అందే సుభాష్, ఎనుగందుల నరసింహులు, సోమారపు శరవిందు, టౌన్ అధ్యక్షుడు ఎడ్ల సందీప్, మండల మహిళా అధ్యక్షురాలు అప్సరున్నిసా, ఎల్సాని మోహన్ కుమార్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బ్రీడింగ్ చెక్కర్లను ఆదుకోవాలి

- విధుల్లోకి తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి
- దరఖాస్తులు తీసుకున్నా పోస్టింగ్ ఇవ్వని వైనం
- యూనియన్ జిల్లా అధ్యక్షుడు భూక్య శ్రీనివాస్

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 11) : బ్రీడింగ్ చెక్కర్లను విధుల్లోకి తీసుకొని తమ కుటుంబాలను ఆదుకోవాలని బ్రీడింగ్ చెక్కర్స్ యూనియన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు భూక్య శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు చిన్నపెల్లి దేవేందర్ కోరారు. ఆదివారం చెన్నారావుపేట మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. వరంగల్ జిల్లాలోని గ్రామాలలో బ్రీడింగ్ చెక్కర్లుగా పనిచేయడానికి విధుల్లోకి తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సత్య శారద జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజారెడ్డికి ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. దీంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజారెడ్డిని సెప్టెంబర్ 30వ తేదీన కలిసి విధుల్లోకి తీసుకోవాలని కోరగా తమ నుండి దరఖాస్తులను స్వీకరించారని పేర్కొన్నారు. అయితే ఇప్పటివరకు విధుల్లోకి తీసుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తమను విధుల్లోకి తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బ్రీడింగ్ చెక్కర్స్ రాజు, శేఖర్, రాంచందర్, భద్రయ్య, సూర్య, రవి, బాబు, రామ్ కుమార్, సీహెచ్ రాజు, దేవేందర్, రాజేశ్వరరావు, చాణిక్య, సరిత, సల్లావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
4
సోమవారం 12.10.2026
www.kalamjyothi.com



కవితమ్మ సీఎం అయితేనే ప్రజలకు మేలు

- పాంచజన్యం పథకాలతో సామాజిక న్యాయం
- ఎల్లారెడ్డిపేట మండలంలో టీఆర్ఎస్‌లో భారీ చేరికలు
- సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ మజీద్

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 11) : తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ అధినేత కవితమ్మ రాష్ట్ర ముఖ్యమంత్రి అయితేనే ప్రజలందరికీ మేలు జరుగుతుందని సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మజీద్ అన్నారు. ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉపాధి ఉద్యోగాలు, సామాజిక న్యాయంతో పాటు రైతే రాజు అనే లక్ష్యాలతో ప్రజల సమస్యల పరిష్కారానికి పాంచజన్యం పథకాలతో ముందుకు వచ్చిన కవితమ్మ నాయకత్వంలో ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తారని పేర్కొన్నారు.

టీఆర్ఎస్ పార్టీలో భారీ చేరికలు..

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఎల్లారెడ్డిపేట, బొప్పాపూర్, పదిర, హరిదాస్‌నగర్ గ్రామాలలో ఆదివారం పార్టీలో భారీ చేరికలు జరిగాయి. నియోజకవర్గ నాయకులు అల్లే శంకర్, కదిరే రేణుక, మండల నాయకులు బొమ్మనవేని పరశురాములు, చిన్ని పెద్ద బాల్‌రెడ్డి, మండల నాయకురాలు ముష్కం నందిని ఆధ్వర్యంలో 300 మందికి పైగా కార్యకర్తలు పార్టీలో చేరారు. వీరికి సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మజీద్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

కవితక్క నాయకత్వంలోనే ప్రజా సమస్యల పరిష్కారం..

ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జ్ మజీద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలందరూ మార్పును కోరుకుంటున్నారని తెలిపారు. అధినేత కవితక్క చేపడుతున్న ప్రజా సమస్యల పరిష్కార ఉద్యమాన్ని చూసి ప్రజలు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతుండటం అభినందనీయమన్నారు. రాష్ట్ర ఆడపడుచు కవితక్క ముఖ్యమంత్రి అయితే సమస్యలు పరిష్కారం కావడంతో పాటు మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యం దక్కుతుందని మహిళలు పెద్ద సంఖ్యలో ముందుకు వస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. పాంచజన్యం పథకాలకు ఆకర్షితులై యువత, మహిళలు, ఉద్యమకారులు, మేధావులు, కవులు, రచయితలు కవితక్కకు అండగా నిలుస్తున్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువజన విభాగం ఇన్‌చార్జ్ సయ్యద్ జావిద్, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలాల ఇన్‌చార్జిలు కదిరి భాస్కర్, మార్వాడి దేవరాజు, గంభీరావుపేట రాజు, ఆరుట్ల సత్యంరెడ్డి, ఓర్సు అశోక్, మౌనిక, లాస్య, ముత్తవ్వ, పద్మ పాల్గొన్నారు.



స్వర్ణ ప్రాజెక్టు గేట్ల మరమ్మతును అడ్డుకున్న గ్రామస్తులు

కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 11) : నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం స్వర్ణ ప్రాజెక్టు జౌళి కాలువ గేటు పనిచేయక పోవడంతో దానిని సరి చేసేందుకు వెళ్లిన నీటిపారుదల శాఖ అధికారులను రైతులు అడ్డుకున్నారు. దీంతో వారు వెనుదిరిగారు. గత ఆరు నెలల నుండి స్వర్ణ ప్రాజెక్టు కు చెందిన జౌళి కాలువ గేటు పనిచేయడం లేదని, ప్రాజెక్టులో నీరు లేని సమయంలో ఎలా మరమ్మత్తులు చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్ నినో ప్రభావంతో స్వర్ణ ప్రాజెక్టులో నీరు లేదని, గేటును మరమ్మతు చేస్తే పూర్తిగా జౌళి కాలువ ద్వారా నీరు వెళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు పేర్కొన్నారు. వర్షాకాల పంటల తరువాత గేటుకు మరమ్మత్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ స్వర్ణ ప్రాజెక్టులో వర్షాభావ ప్రభావంతో నీరు చేరలేదని దీంతో చుట్టుపక్కల గ్రామాల రైతులకు, ప్రజలకు తాగునీరు అందే పరిస్థితి లేదన్నారు. అధికారులకు ఎన్నో రోజుల నుంచి మొరపెట్టుకుంటున్నా నీరు లేని సమయంలో మరమ్మత్తులు చేయడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు.



బాలా త్రిపుర సుందరిగా అమ్మవారు

- నర్సంపేటలో వైభవంగా దేవీ నవరాత్రులు
- బీజేపీ నేత రాణా ప్రతాప్ రెడ్డి ప్రత్యేక పూజలు

కలంజ్యోతి, నర్సంపేట (అక్టోబర్ 11) : మున్సిపాలిటీ పరిధిలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో అమ్మవారు శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి అవతారంలో భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. విశేష పుష్పాలంకరణలు, దీపకాంతుల నడుమ పూజా ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. అమ్మవారి దర్శనార్థం భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ప్రాంగణం భక్తజన




సందోహంతో కిటకిటలాడింది. నామస్మరణలు, మంగళవాయిద్యాలు, జయజయధ్వానాల నడుమ భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలి..

ఈ వేడుకల్లో బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగన్మాత కరుణాకటాక్షాలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, నర్సంపేట నియోజకవర్గం సకల సంపదలతో సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఉత్సవ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.

ధార్మిక ఐక్యతకు ప్రతీకగా ఉత్సవాలు..

హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు ధార్మిక సంప్రదాయాలు, సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలను చాటిచెబుతూ భక్తుల్లో ఐక్యతను పెంపొందిస్తున్నాయని పలువురు కొనియాడారు. అమ్మవారి దివ్యరూపం, నామస్మరణలతో మార్మోగిన పూజా ప్రాంగణం భక్తి పారవశ్యానికి ప్రతీకగా నిలిచింది.



నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం

కలంజ్యోతి, నిర్మల్, (అక్టోబర్ 11): దసరా సందర్భంగా పట్టణంలోని బంగల్‌పేట్ మహాలక్ష్మి ఆలయం వద్ద దసరా నవరాత్రి ఉత్సవాలను మున్సిపల్ చైర్‌పర్సన్ అప్పాల కావ్య, వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డితో కలిసి ఆదివారం ప్రారంభించారు. మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా మహాలక్ష్మి ఆలయం ప్రాంగణంలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. నిర్మల్ పట్టణంలోని ప్రజలు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రావణ దహన కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. బంగల్‌పేట్ యూత్, మహాలక్ష్మి ఆలయ కమిటీ, విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు కొనసాగుతున్నాయని తెలిపారు. దుర్గామాత నిమజ్జన కార్యక్రమాన్ని పురస్కరించుకుని అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీనివాస్, లక్కాకుల హరీష్, శ్రీరామోజీ నరేష్, కూన శశాంక్, మహాలక్ష్మి ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల రాజు, వైస్ చైర్మన్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి టింకు, బంగల్‌పేట్ యూత్ అధ్యక్షుడు విక్కి, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కాలనీ వాసులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు

కలం జ్యోతి, నిర్మల్, (అక్టోబర్ 11): నిర్మల్ పట్టణ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. కోలాటాలు ఆడుతూ మహిళలు సందడి చేశారు. సంఘం ఆవరణలో దుర్గామాత విగ్రహాన్ని ఆవిష్కరించి భక్తిశ్రద్ధలతో పూజించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఆమెద శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 11) : మండల కేంద్రానికి చెందిన మైధాం రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి అండగా నిలిచేందుకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు సర్పంచ్ కంది శ్వేత కృష్ణ చైతన్య రెడ్డి 50 కిలోల బియ్యాన్ని పంపించారు. మాజీ సర్పంచ్ మేకల నర్సయ్య, అదుప అశోక్ స్థానిక నాయకులతో కలిసి మృతుడి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి బియ్యాన్ని అందజేశారు. మైధాం రాజు మృతి పట్ల



ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

5

సోమవారం 12.10.2026

www.kalamjyothi.com



మాదారపు వెంకటయ్య మృతికి నివాళులు

- బీఆర్ఎస్ నేతల పరామర్శ
- కుటుంబానికి అండగా ఉంటామని భరోసా
- శ్రీనివాస్‌కు పెద్ది స్వప్న ఫోన్‌లో పరామర్శ

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 11) : మండలంలోని లింగగిరి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మాదారపు శ్రీనివాస్ తండ్రి మాదారపు వెంకటయ్య (70) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. వెంకటయ్య మృతి విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాల్నే వెంకన్న మృతుడి నివాసానికి చేరుకుని పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వెంకటయ్య మృతి పట్ల మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి ఫోన్ ద్వారా మృతుడి కుమారుడు శ్రీనివాస్‌ను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ మురహరి రవి, సర్పంచ్ మేడబోయిన రజిత కుమార్, మాజీ ఎంపీటీసీ పరకాల లక్ష్మి రాజన్న, గ్రామ పార్టీ అధ్యక్షుడు వనాల మోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్ గట్టు విష్ణు, కార్యదర్శి అనుముల అశోక్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ బోడ మురళి నాయక్, వార్డు సభ్యులు పులి కవిత రమేష్, కరకాల అఖిల్, మాదారపు బాబు, యూత్ నాయకులు రామ్ పటేల్, గుగులోతు స్వామి నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలి

- ఎండిన పంటలను పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు
- ప్రభుత్వం వెంటనే సర్వే చేసి ఆదుకోవాలి
- పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జ్ మోటూరి రవి

కలంజ్యోతి, నర్సంపేట (అక్టోబర్ 11) : సాగునీరు అందక ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలని బీఆర్ఎస్ క్లస్టర్ ఇన్‌చార్జ్ మోటూరి రవి డిమాండ్ చేశారు. నర్సంపేట రూరల్ మండల పరిధిలోని గురిజాల గ్రామంలో బీఆర్ఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నాట్లు వేసి నీళ్లు లేక ఎండిపోతున్న పంటలను రైతులతో కలిసి నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా మోటూరి రవి మాట్లాడుతూ గురిజాలలో వరితో పాటు ఇతర పంటలు సాగు చేసిన రైతులు సాగునీరు లేక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి అధికారులతో సర్వే చేయించి రైతులను ఆదుకోవాలన్నారు. గతంలో అధిక వర్షాలతో పంట నష్టం వాటిల్లినప్పుడు మాజీ సీఎం కేసీఆర్ సహకారంతో నాటి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి రైతులకు పరిహారం అందించి అండగా నిలిచారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు గడ్డం కొమురయ్య, బండారి రమేష్, మాజీ రైతు సమన్వయ కమిటీ కన్వీనర్ అన్న రాజమల్లు, అల్లి రవి, మాజీ ఉప సర్పంచ్ మంచిక హరీష్, వార్డు సభ్యుడు గజ్జి రాము, గౌడ సంఘం గౌరవ అధ్యక్షుడు మంచిక దేవేందర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పతి కుమారస్వామి, యూత్ మండల ప్రధాన కార్యదర్శి సంగం శ్రీకాంత్, సీనియర్ నాయకులు మర్ద సవీన్, నీలం కృష్ణమూర్తి, ఎడ రమేష్, మాటూరి రవీంద్ర చారి, యశోద నర్సింగం, ఆకుల అశోక్, దూడల ప్రవీణ్, శ్రీరామోజు బ్రహ్మాచారి, బండారి అశోక్, చిర్ర యాకూబ్, చిర్ర భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


బార్దాన్, ట్రాన్స్‌పోర్ట్ డబ్బులు చెల్లించాలి

ఐదు నెలలు గడుస్తున్నా పైసా ఇయ్యరా? : జన్ను రమేష్

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 11) : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన యాసంగి మొక్కజొన్నలకు సంబంధించిన ట్రాన్స్‌పోర్ట్, బార్దాన్ ఖర్చులను రైతుల ఖాతాల్లో వెంటనే జమ చేయాలని ఎంసీపీఐయూ మండల కార్యదర్శి జన్ను రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో అధికారుల వైఫల్యం వల్ల రైతులే అప్పులు చేసి ఒక్కొక్కరు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు సొంత ఖర్చులతో బార్దాన్ సమకూర్చుకుని ధాన్యాన్ని తరలించారని తెలిపారు.

స్పష్టమైన లెక్కలున్నా చెల్లించరా?

సొంతంగా ఖర్చు పెట్టుకుంటే వెంటనే ఖాతాల్లో జమ చేస్తామని నాడు అధికారులు హామీ ఇచ్చి, ఐదు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు పైసా విడుదల చేయకపోవడం దారుణమన్నారు. సొంత ఖర్చులతో తరలించిన రైతుల వివరాలు అధికారుల వద్ద స్పష్టంగా ఉన్నా కాలయాపన చేయడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి బార్దాన్, రవాణా డబ్బులు జమ చేయాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థికసాయం

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 11) : మండల కేంద్రానికి చెందిన ఆటో యూనియన్ సభ్యుడు బొంత సురేష్ అనారోగ్యంతో మృతి చెందగా, ఆదివారం ఆయన దశదిన కర్మకు హాజరైన యూనియన్ బాధ్యులు బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం యూనియన్ అధ్యక్షుడు సిద్ద ఉపేందర్ మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ ఉపాధ్యక్షుడు కరెడ్ల శివ, ముఖ్య సలహాదారులు ఎండీ పాషా, గుర్రం భిక్షపతి, సీనియర్ ఆటో డ్రైవర్లు ముదురుకోళ్ల భిక్షపతి, తాళ్లపెల్లి రమేష్, కమిటీ సభ్యులు కేశపాక రమేష్, దారావత్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

సర్పంచ్ కరుణాకర్

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 11) : మండల పరిధిలోని పాత మద్దుంపురం గ్రామ పరిధి నెక్కొండ-నర్సంపేట ప్రధాన రహదారి డివైడర్‌లో బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ఆదివారం పూల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. సర్పంచ్ ననుమాస కరుణాకర్, ఉపసర్పంచ్ అలువాల శ్రీనివాస్ మొక్కలు నాటి పచ్చదనం పెంపునకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పండుగల వేళ గ్రామాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు ఈ బృహత్తర కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. డివైడర్‌లో పూల మొక్కలు పెరిగితే రహదారికి శోభ చేకూరడంతో పాటు ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుందన్నారు. నాటిన మొక్కలను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కట్టూరి లక్ష్మణచారి, జన్ను రమేష్, షేక్ హసీనా యాకుబ్, పంచాయతీ సిబ్బంది కల్వచర్ల సాంబయ్య, నాంపల్లి కొమురయ్య, నాంపల్లి ఐలమల్లు, మేకల రాజు తదితరులు పాల్గొన్నారు.



ఇమ్రాన్‌తో భూమి పెడ్నేకర్ రొమాన్స్

కలం జ్యోతి
తెలుగు దినపత్రిక

బాలీవుడ్‌లో విలక్షణమైన కథాంశాలు ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి భూమి పెడ్నేకర్ మరో ఆసక్తికర ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమయ్యారు. చాన్నాళ్ల విరామం తర్వాత హీరో ఇమ్రాన్ ఖాన్ గ్రాండ్ రీఎంట్రీ ఇస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ చిత్రం 'అధురే హమ్ అధురే తుమ్'లో ఆమె హీరోయిన్‌గా నటిస్తున్నారు. 'కభీ కభీ అదితి..' పాటతో యువత మనసులు గెలుచుకున్న ఇమ్రాన్ ఖాన్ చాలా కాలం తర్వాత పూర్తిస్థాయి కథానాయకుడిగా కనిపిస్తుండగా, భూమి పెడ్నేకర్ నటన ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనుందని తెలుస్తోంది.

వైవిధ్యమైన పాత్రలకు ప్రాధాన్యమిచ్చే భూమి పెడ్నేకర్, ఇమ్రాన్ ఖాన్ కాంబినేషన్ తెరపై సరికొత్త అనుభూతిని అందించబోతోందని బాలీవుడ్ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ చిత్రంలో గుర్‌ఫతేహ్ పీర్జాదా కీలక పాత్ర పోషిస్తుండగా, దానిష్ అస్లామ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్‌లో వచ్చిన 'హ్యాపీ పటేల్: ఖతర్నాక్ జసూస్' చిత్రంలో అతిథి పాత్రలో మెరిసిన ఇమ్రాన్, ఇప్పుడు పూర్తిస్థాయిలో నటిస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 18న నేరుగా ప్రముఖ ఓటీటీ వేదికగా విడుదల కానున్నట్లు సమాచారం.

Printed and Published by PENDYALA JYOTHI on behalf of PENDYALA JYOTHI, Printed at Rudra Kakatiya Printers and Graphics H.no.183/85/12/38, Somidi Road, Kazipet, Warangal, 506003., Published at H.No. 30/1/426, Madikonda, Kazipet, Hanumakonda District. Telangana, 506142, Editor : RAMESH PENDYALA. Ph : 9494 009 003.